# ఆశ

కార్నర్ సీట్‌లో వెనక్కి జారగిలబడి కూర్చున్న విశాలరావును అతని కెదురుగా వయ్యారంగా కూచుని అంత కంటే వయ్యారంగా ముఖ భంగిమలు మారుస్తున్న ఆ యిరవయ్యేళ్ళ అందమయిన అమ్మాయి యిందాకటినుంచీ ఆకర్షిస్తూనే వుంది.

ఆ అమ్మాయి విశాలరావుకు పూర్తిగా అపరచిత. రెండు స్టేషన్లకుముందే ఆ కంపార్టుమెంటులో ఎక్కింది. ఎక్కినప్పటినుంచీ విశాలరావు దృష్టిని ఆకర్షించింది. స్త్రీఅయి వుండి పురుషులపెట్లో ఎందుకు ఎక్కవల్సివచ్చిందో విశాలరావుకు అర్థంకాని విషయం.

విశాలరావు ప్రక్కన అతనుగాక ఇంకా ముగ్గురు కూచున్నారు. ఆ ముగ్గురిలో ఒకాయన న్యూస్ పేపరు చదవటంలో నిమగ్నుడయిపోయి యీ లోకాన్ని పూర్తిగా మరిచి

పోయోడనే చెప్పవచ్చు. ఇటు చివర కూర్చున్న ఆయన బహుశా సంగీతకళ నారాధిస్తున్న వాడై వుండాలి. తనలో తనే పాడుకుంటూ తన్మయత్వం చెందుతున్నాడు. ఇక మధ్య కూర్చున్న ఆ నల్లద్దాల కళ్ళజోడు ఆయనదే ఎటూ తేలని విషయం.

ఆయనకు కళ్ళజోడు వుండటంమూలంగా ఎటు చూస్తు న్నాడో వూహించటం కష్టం. ఆలోచిస్తున్నాడో లేదో ఆయనకే తెలియాలి. పోతే ఎదుటిసీట్లో ఆ అందమైన అమ్మాయి ప్రక్కన కొంచెం దూరంగానే కూర్చున్న యిద్దరు తల నెరిసిన వారూ తమ గొడవలో తాము పడి వున్నారు.

రైలు మామూలు వేగంతో పోతూంది. విశాలరావు దాటిపోతున్న టెలిఫోన్ పోల్సుని మధ్య మధ్య చూస్తూ, ప్రక్కవాటుగా ఆ అమ్మాయిని చూస్తూనే వున్నాడు.

ఆ అమ్మాయి కొంచెంసేపు ఏదో పత్రిక తిరగ వేసింది. మరో కొంతసేపు అందరిముఖాల్ని పరిశీలించింది. ఒకసారి వయ్యారంగా వళ్ళు విరుచుకుంది. ఆతరువాత ఏమనుకుందో ఏమో తన కుడిచేత్తో పట్టుకునివున్న హేండ్ బ్యాగ్ తెరిచి అందులోంచి చిన్న అద్దం బయటకు తీసి తన ముఖం చూసు కుంది. కిటికీపక్కనే కూచోటంవల్ల గాలికి ఆమె ముంగురులు రేగుతున్నాయి. వాటిని ఒకచేత్తో అణగ దీసుకునేందుకు ప్రయత్నిస్తూ అద్దం లోపల పెట్టేసింది. తరువాత అందు లోంచే ఒక నోట్లదొంతరను బయటకుతీసింది. వాటిని తాపీగా ప్రక్కన పెట్టుకుని లెక్క పెట్టుకో సాగింది.

విశాలరావుకు ఒక్కసారిగా కళ్ళు జిగేలుమన్నై. ఆమె ధనవంతురాలు అయివుండాలి. ఆ డబ్బంతా తనదయిపోతే! ఒక నెలరోజులు కాలుమీద కాలేసుకుని, హాయిగా, దర్జాగా...

విశాలరావు ఒక్కసారిగా ఉలుక్కిపడ్డాడు. ఆమె లెక్క పెట్టుకోవటం పూర్తి చేసింతర్వాత, ఆ నోట్లను తిరిగి హ్యాండ్ బ్యాగ్‌లో పెట్టుకునేలోపలే కిటికీలోంచి దూసుకు వచ్చిన గాలికి ఒక పదిరూపాయల నోటుపోయి మూల నక్కింది. ఆ అమ్మాయి దాన్ని గమనించినట్లు లేదు. మిగిలిన వాటిని భద్రం చేసుకుని, చేతిసంచీ మూసివేసి తిరిగి పత్రిక తిరగవేయసాగింది.

విశాలరావు కొంచెం భయంగా ఒకసారి అందరి ముఖాలవంకా చూశాడు. ఒక్క నల్లద్దాల కళ్ళజోడువాడు తప్ప మిగిలిన వారందరి విషయం సంతృప్తికరంగానే వుంది. ఆ ఒక్కడే ఎటు చూస్తున్నాడో, ఏం చేస్తున్నాడో తేలకుండా వుంది.

విశాలరావు ఆలోచనలో పడ్డాడు. పరిస్థితిచూస్తే ఎవ్వరూ చూసినట్లు లేదు. ఆ ఒక్క కళ్ళజోడువాడిదే తన కనుమానం. అయితే ఇప్పుడేంచేసేట్లు? ఆ పదిరూపాయల నోటు అక్కడే ఉందని ఆమెకు చెప్తే?...

ఏమంటుంది? ఒక థ్యాంక్స్ పారేస్తుంది. చాలదూ? తన జీవితంలో ఏ స్త్రీ అయినా యింతవరకూ, ఒక్కసారి... ఒక్క థ్యాంక్స్...

"ఛఛ. ఏమిటీ ఆలోచనల్లు?_ అనుకున్నాడు విశాల రావు. ఆస్త్రీ ఒకసారి తన్ను ఏదో అన్నంతమాత్రాన తను మంచయి కరిగిపోవాలా? కాలేజిలో చదివేటప్పుడు కిష్టిగాడు అంటుండేవాడు "ఐస్" అని. అలాంటిది. ఆ అమ్మాయి అలా అని ఆ నోటు తీసుకుని చక్కా తనదారిని తను పోతుంది. అప్పుడు తన కేం ఒరిగినట్లు?

ఊహు. తనకు థ్యాంక్సు అక్కర్లేదు. డబ్బు కావాలి. ఆ పదిరూపాయల నోటు తనదయిపోతే చాలు. తనకు డబ్బు లేదని కాదు, డబ్బుకోసం మొహం వాచి వున్నాడనికాదు. చులాగ్గా పది రూపాయలు వస్తుంటే వదులుకోవటం యెం దుకూ అని.

అయితే ఆ నోటు తన పరం కావట మెట్లాగా అని? తను యిప్పు డప్పుడే దిగడు. అరవై మైళ్ళ పైమాట. ఆ అమ్మాయి యీలోపున ఎక్కడయినా దిగిపోతే? అంతకన్నా ఏం కావాలి తన కింకా?

తను ఆ నోటువంకే చూస్తుంటే, అయితే గియితే తన దృష్టి నెవరయినా కనిబెడితే తన అదృష్టం చేజారుతుందని విశాలరావుకి తెలుసు. అందుకని తల వంచుకున్నట్లే వంచు కుని, బయటకు చూస్తున్నట్లేచూస్తూ, ఏదోఆలోచిస్తున్నట్లే ఆలోచిస్తూ, ఎలాగో సందు చూసుకుని ఆ పదిరూపా యల కాగితమ్ముక్క వంక అప్పుడప్పుడూ చూస్తూనే వున్నాడు.

తను నిద్రలేచీ లేవంగానే ఎవరిమొహం చూశాడో? బాగా గుర్తు వచ్చింది. చాకలి రాముడు మొహమేగా!

చాకలాడ్ని చూస్తే కీడు కలుగుతుందంటారే యీ పెద్దలని పిలవబడేవాళ్లు. పెద్దలమాటల్ని నమ్మకూడదని నమ్మాడు విశాలరావు.

రైలు ఆగుతూంది. నెల్లూరు గావును. కాస్త టీ తీసు కుంటే బావుండును... విశాలరావు తన ఆలోచనను సరిదిద్దు కున్నాడు. ఎట్లాగా? తను లేచి వెళ్తే ఆ డబ్బును విడిచి దూరంగా వుంటే, తనది కాకుండా పోతుందేమో.

రైలు ఆగంటతోనే ఆ అమ్మాయి పత్రికమూసి ప్లాటు ఫారంవంక చూడసాగింది. ఒక నిమిషం గడిచింతర్వాత ఆమె దృష్టిని ఎవరాకర్షించారో ఏమో, "రాధా" అని కేకవేసింది ఉత్సాహంగా. దాంతో రాధ అని పిలువబడిన అమ్మాయి ఎకాయకిని కిటికీ ముందు కొచ్చేసి "హల్లో సునీధా. ఇక్కడ కూర్చున్నా వేమిటి?" అనడిగింది.

"లేడీస్ కంపార్టుమెంటులో చోటు లేకపోతే..."

"ఇప్పుడుందిలే పద. తర్వాత మాట్లాడుకుందాం" అని ఆ రెండో లేడికళ్ళ పిల్ల అనటంతోటే 'అయితే వస్తున్నా వుండు' అని లేచి పైన బర్తు మీద వున్న సూట్ కేస్ తీసుకుని హ్యాండ్ బ్యాగ్ తోసహా అక్కడినుంచి దిగి వెళ్ళిపోయింది మొదటమ్మాయి_ లేకపోతే సునీధ.

పదిరూపాయలనోటు అక్కడే వుంది కదలకుండా. సంగీతపుటాయన టీ తాగుదామనికాబోలు దిగాడు. విశాల రావు కూర్చున్నది యింటర్ క్లాస్ కంపార్టుమెంటులో మధ్యది. ప్రక్కదాంట్లోంచి ఒక్కసారిగ మిన్ను విరిగి మీద

పడినట్లుగా వినిపించింది ఒక నవ్వో ఏడుపో తెలీని గార్ధభ స్వరం.

"ఇంకెవ్వరూ ఎక్కపోతే బాగుండును" అనుకున్నాడు విశాలరావు. అనుకోవటం పూర్తి కాకుండానే ఒక పోలీసు కాన్‌స్టేబులు బూట్లు చప్పుడు చేసుకుంటూ లోపలకి వచ్చి ఒకసారి నలువయిపులా చూశాడు. ఆ ఖాళీగాగావున్న సీట్లో కూర్చుంటాడేమోనని భయపడ్డాడు విశాలరావు. కాని ఆ కాన్‌స్టేబుల్ అలా చేయలేదు. కొంతమందికి నిల్చోటం సరదా. అతను అటువైపుకీ పోకుండా యిటువైపుకీ రాకుండా మధ్యస్థంలో నిల్చుని, వంగుని కిటికీలోంచి బయటకి చూడసాగాడు.

విశాలరావు విసుక్కున్నాడు. "చప్పున రైలు కదిలితే బాగుండును" అనుకున్నాడు. ఆ పదిరూపాయలనోటు ఆ మూలపడివుండి యింతవరకూ ఎవ్వరికళ్ళా పడకుండా వుండటమే అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఆ నోటును తన స్వంతం ఎప్పుడు చేసుకుందామా అని అతని ఆదుర్దా.

రైలు కదిలింది. సంగీతపుటాయన ఒక్క విసురున లోపలకు వచ్చి తన సీటులో కూర్చున్నాడు. టీ తాగేగి మెలకువగా వుండటంకంటే నిద్రే ఎక్కువ అవహిస్తుందేమో. మరుక్షణంలో అతను కునికిపాట్లు పడసాగాడు.

విశాలరావు జాగ్రత్తగా ఒకసారి నలువయిపులా చూశాడు. ఎవరిధోరణిలో వాళ్ళున్నారు. కళ్ళజోడాయన యిందాకటిమాదిరే వున్నాడు. విశాలరావు గుండె వేగంగా కొట్టుకుంది. ఆ నోటు తన స్వాధీనం చేసుకోవాలి. అంటే

దాన్ని తీసుకుని తన జేబులో తోసి వేయాలన్నమాట. అతనికి కొంచంగా వొణుకుపుట్టింది. "వద్దులే" అనుకున్నాడు ఒకసారి. "పది రూపాయలు ... అకారణంగా ... అనాలోచితంగా..." విశాలరావు ధైర్యం చేశాడు. భయంతో యింకొకసారి అందరివంకా చూడటం కూడా మరిచిపోయాడు. ఆనోటు ఒకటే అతని కళ్ళకు కన్పిస్తోంది. దాన్ని తీసుకుని... జేబులో వేసుకుని... హాయిగా...

ముందుకు వంగాడు జాగ్రత్తగా. కుడిచెయ్యి ముందుకుపోయి నోటుమీద వ్రాలింది. చటుక్కున మడిచి వెనక్కి లాక్కోపోయాడు. మరుక్షణంలో అతని చేతిమీద బలమైన మరో చెయ్యి పడింది.

విశాలరావు నిశ్చేష్టు డయిపోయాడు. అతనికి ముచ్చెమటలు పోశాయి. భయం భయంగా తల ప్రక్కకు తిప్పి చూశాడు_ నల్లద్దాల కళ్ళజోడు.

"ఇది నాది" అన్నాడు బిక్క మొహం పెట్టి విశాలరావు.

"నాది" అన్నాడు కళ్ళజోడాయన. అతని నిల్చుని వున్నాడు. అని ఆ నోటుకోసం విశాలరావు చేతో పెనుగులాడాడు.

"నాదయితే?"

"నాదంటుంటే"

విశాలరావు పూర్తిగా చప్పబడిపోయాడు. బిక్కచచ్చిపోయి ఒకసారి పెట్టెలోని అందరివంకా చూశాడు. అంతా తనవంకే చూస్తున్నారు పోలీసువాడితో సహా.

"నీ దెలాగయింది?"

"నీ దెలాగయిందీ?"

"అది నాదే అంటుంటే"

"అదే నేనూ అంటుంటే"

పోలీసువాడు ముందుకు వచ్చాడు. "ఏయ్. అలా పెనుగులాడుకోకండి. అది కాస్తా చిరిగిపోతుంది. ముందిటివ్వండి. ఇచ్చి విషయమేమిటో చెప్పండి" అన్నాడు చెయ్యి జాపుతూ. ఆ మాట విని యిద్దరూ ఒకేసారి ఆనోటు వదిలేశారు. పోలీసు కానిస్టేబులు అది తీసుకుని చేతిలో పట్టుకున్నాడు.

"ఇప్పుడు చెప్పండి"

"ఆ నోటు నాది. పర్సులో డబ్బు తీసి లెక్కబెట్టుకుంటూంటే ఎగిరి అక్కడ పడిపోయింది" అన్నాడు విశాలరావు. తను కొత్తగా తెచ్చి పెట్టుకున్న ఆలోచన నుపయోగించి.

"మీరేమిటంటారు"?" అన్నాడు కానిస్టేబులు కళ్ళజోడాయనవంక తిరిగి.

"అది నా జేబులోది. దువ్వెన తీసుకుందామని తీసుకుంటుంటే ఎగిరి అక్కడకుపోయి పడింది" అన్నాడతను.

పోలీసువాడు విశాలరావువంక తిరిగి అడిగాడు. "మీ పర్సేది!"

విశాలరావు పర్సు తీసి చూపించాడు. "అసలు మీ దగ్గర మొత్తం ఎంత వుండాలి?" అనడిగాడు పోలీసు.

విశాలరావు అంత తెలివితక్కువ వాడేంకాదు. "పది

హేనూ ఆరణాలు." తన పర్సులో అంతకు ముందు వున్న దానికి యీ పది రూపాయలు కలిపి చెప్పాడు.

కళ్ళజోడాయన్ని కూడా అలాగే అడిగాడు పోలీసు వాడు. "పదిహేడూ ఏడణాల ముక్కాలనీ" అని చెప్పా డాయన నిశ్చలంగా. ఆయనదగ్గర చూస్తే ఏడు రూపాయల ఏడణాల మూడు కాన్లు వున్నాయి నిజంగా.

పోలీసువాడు యిలా పరిష్కరించలే ననుకున్నట్టు న్నాడు. తన బుద్ధిబలాన్నుపయోగించి ఒక ఉపాయా న్నాలోచించాడు. ఆ పదిరూపాయల నోటు గుప్పెట్లో మూసి "దీని నెంబ రెంత?" అనడిగాడు. ఇద్దరూ తెల్లమొహాలు వేయాల్సి వచ్చింది.

"నాకు గుర్తు లేదు" అన్నాడు విశాలరావు.

"నాకు నెంబర్లుచూసే అలవాటు లేదు" అన్నాడు కళ్ళజోడాయన.

"అయితే ఎలాగ పరిష్కరించటం? ఇద్దంకీ సగం సగం చించి యిచ్చేదా?" అన్నాడు పోలీసు కాన్‌స్టేబులు. పెట్టెలో మిగిలినవాళ్ళంతా నవ్వారు. తన జోక్‌కి యింతమంది నవ్వి నందుకు అందరివంకా ఒకసారి గర్వంగా చూశాడు కాన్‌స్టేబులు.

విశాలరావు ధైర్యం తెచ్చుకున్నాడు. "ఇది హాస్యం కాదు" అన్నాడు.

"అదే నేనూ అంటూంట" కళ్ళజోడాయన తనవాదన వొదిలిపెట్టలేదు. ఈ సమస్య యిలాగయితే తెగేటట్టు లేదు.

16)

పోలీసువాడికీ విసుగొచ్చినట్టుంది. "మరయితే ఎలాగయ్యా యిది తేల్చటం?" అన్నాడు కొంచెం చిరాగ్గా.

"ఏమో మరి"

"ఏమో"

పోలీసువాడు వీళ్ళిద్దరి ముఖాలవంకా ఒకసారి తీక్షణంగా చూశాడు; ఆ తర్వాత చేతిలోవున్న నోటువంక చూశాడు. ఒక నిమిషం అలాచేసి అ౯ తెలిసింది" అన్నాడు గట్టిగా అందరూ హడలి చచ్చేటట్లు.

అంతా అతని ముఖంవంక చూశారు.

"ఇది దొంగ సొమ్ము"

విశాలరావు గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

"వీళ్ళిద్దర్లో ఒకరు దొంగయి వుండాలి"

సంగీతపుటాయన యీసారి కల్పించుకున్నాడు. "అంటే అది ఎట్లా?" అని అడిగాడు.

"వారం రోజుల క్రితం సేట్ హీరాలాల్ కొట్లో వెయ్యి రూపాయల విలువగల నోట్లు దొంగిలించబడ్డాయి. ఇదిగో, ఆ నోట్లు నెంబర్లలో దీని నెంబరుంది" అన్నాడు పోలీసు తన నోట్‌బుక్ తెరిచి అందులో చూస్తూ.

విశాలరావు హతాశు డయిపోయాడు. కళ్ళజోడాయన నిల్చోలేక పోయాడు కాబోలు, కూలబడ్డాడు.

"ఇది నాది కాదు, నిజంగా. యిందాక ఒకామె యిక్కడ కూర్చుని వెళ్ళింది. ఆమెవద్దనుంచి జారిపోయి వుంటుంది. ఊరికినే ఆశపడి నే నలాగన్నాను" అన్నాడు విశాలరావు వొణుకుతున్న గొంతుతో.

కళ్ళజోడాయన మాట పొడిగించటానికి అశక్తుడయాడేమో, "నేనూ అంతే" అన్నాడు అపస్వరాలు పలుకుతూ.

"మరి యిందాక మీాదే నన్నారు?"

"ఆశపడి"

"బుద్ధి గడ్డితిని"

"ఎలా నమ్మటం? ఇంతలా అలాగని యిప్పు డిలా అంటుంటే?" పోలీసువాడి కంఠంలో అంతకంతకీ కరుకుతనం జాస్తి అవుతూంది.

"నిజంగా ఆమె యీా ట్రెయిన్‌లోనే యింటర్ కంపార్టుమెంటులో ఎక్కింది" అన్నాడు విశాలరావు.

"అయితే మిమ్మల్ని నమ్మమంటారు!"

"ఊఁ"

"మిమ్మల్ని వదిలేయమంటారు!"

"ఊఁ"

"ఇంకెప్పుడూ యిలా అబద్ధాలు పలకరుగా"

"ఊహు"

పోలీసువాడు ఆనోటు తీసుకుని జేబులో పెట్టుకున్నాడు. "ఆమె యింటర్ కంపార్టుమెంట్‌లో ఎక్కిందా?" అనడిగాడు.

"అవును. ఎవరో స్నేహితురాలు కనిపిస్తే లేడీస్ కంపార్టుమెంటులో ఎక్కుతానని వెళ్ళిపోయింది" అన్నాడు విశాలరావు.

రైలు స్టేషన్ సమీాపించింది.

"నేను ఆమెను వెతికి పట్టుకుని అరెస్టు చేసేస్తాను" అన్నాడు పోలీసువాడు. రైలు ఆగింతర్వాత దిగి గబగబ వెళ్ళిపోయాడు.

నిమిషాలు గడిచిపోతున్నాయి. పోలీసువాడు కనిపించ లేదు... రైలు కూత వేసి కదిలింది. అంతలో ఎక్కడినుంచో వచ్చాడు పోలీసువాడు. అతని పెదవులమీద చిరునవ్వు తాండవిస్తూంది.

"అచ్ఛా. అచ్ఛా బాయిమో. ఆమె వచ్చి డబ్బు విషయం అడిగితే ఎర్రబుట్ట ఎగరేసు కెళ్ళిందని చెప్పండి. ఉంటా" అన్నాడు చేదులూపుతూ.

ఇద్దరూ తెల్లమొహాలేశారు. రైలు ప్లాట్‌ఫారం విడిచి సాగిపోతూంది.

---